క్లుప్తంగా

నేడు మార్షల్ ఆర్ట్స్ జిల్లా జట్ల ఎంపిక

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ అండర్–14,17,19 బాలబాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక పసుమర్రు మద్ది కామయ్య జెడ్పీ హైస్కూలులో ఆదివారం నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం వై. హనుమంతరావు తెలిపారు. పోటీల్లో పాల్గొన దలిచిన వారు ఉదయం 9గంటలకు పసుమర్రు హైస్కూలులో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9703678786, 7075001306 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు సద్ది



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మార్కాపురం రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవాలయంలో ఐనవోలు గ్రామానికి చెందిన అయ్యప్ప, శివ, భవాని స్వాములు సంయుక్తంగా దీక్ష స్వాములకు శనివారం సద్ది ఏర్పాటు చేశారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరు స్వామి మాట్లాడుతూ కార్తిక మాసంలో మాలాధారణ స్వాములకు సద్ది ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య ప్రదమని తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం మోడల్ స్కూలులో శనివారం 'బీ ద చేంజ్' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగా, మానసికంగా విద్యార్థులు దృఢంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సంస్థ ప్రతినిధులు పాపసాని సురేష్, చిన్నకొండ మల్లికార్జునరెడ్డి, కొర్ని విజయభాస్కర్‌రెడ్డి, అంజిరెడ్డి, సీహెచ్. హేమంత్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి వడ్డీ మినహాయింపు పొందండి

నరసరావుపేట: పురపాలక సంఘానికి 2023–24 అర్ధ సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, కుళాయి చార్జీలు డిసెంబరు ఆఖరులోగా చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని కమిషనర్ ఎం.రామ్మోహన్ శనివారం కోరారు. పన్నులు కార్యాలయంలోని ట్రెజరీ, వార్డు సచివాలయంలో పరిపాలనా కార్యదర్శి, ఆన్‌లైన్ వెబ్‌సైటులో చెల్లించాలని ఆయన సూచించారు.

తుపాను హెచ్చరికతో అప్రమత్తంగా ఉండండి

యడ్లపాడు: రానున్న తుపాను హెచ్చరిక కారణంగా గ్రామ రెవెన్యూ అధికారులు అప్రమత్తం కావాలని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు తెలిపారు. ఆయన శనివారం రాత్రి మాట్లాడుతూ పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశా మేరకు రెండు, మూడు రోజుల్లో తుపాను నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. రైతులంతా పంట చేలల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో శిథిలమైన నివాసాల్లో ఎవరూ ఉండరాదని, చిన్నారులు, పశువులు కాల్వలు, వాగుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు చూడాలని చెప్పారు. తుపాను హెచ్చరికలను మైక్ ద్వారా ప్రచారం నిర్వహించాలని గ్రామ రెవెన్యూ అధికారుల్ని ఆదేశించామని తెలిపారు.

6న గుంటూరులో కేఎన్‌పీఎస్ రాష్ట్ర సదస్సు



నరసరావుపేట: గుంటూరులో ఈనెల ఆరో తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ కోరారు. ఎన్జీవో హోంలో శనివారం సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం–కుల నిర్మూలన, భారత రాజ్యాంగం–ఒక విశ్లేషణ అనే అంశాలపై సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి.చిన్న ప్రసాదు, జె.బ్రహ్మయ్య, సత్యానంద్, పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు, పీకేఎస్ నాయకుడు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

ఓటు వేయడం యువత బాధ్యత



సొలస పోలింగ్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అధికారి కుటుంబరావు



కారుమంచి పోలింగ్ కేంద్రంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారులు

యడ్లపాడు: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువకులంతా తప్పనిసరిగా ఓటరుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా నిర్వహిస్తోన్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని శనివారం అధికారులు నిర్వహించారు. బీఎల్‌వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా పోలింగ్ కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో ఉండి, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సహాయ ఓటరు నమోదు అధికారి కుటుంబరావు మైదవోలు, లింగారావుపాలెం, సొలస, కొత్తసొలస పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్ని తనిఖీ చేశారు. బీఎల్‌వోల రిజిస్టర్, పెండింగ్‌లోని క్లెయిమ్‌లు, విచారణ వివరాలు పరిశీలించారు. బీఎల్‌వోలు తమ వద్ద ఉన్న ఎన్నికల రికార్డుల్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 68 అర్జీలు అందాయని తెలిపారు. వీటిలో ఫారం (6) అర్జీలు–41, ఫారం(7)– 11, ఫారం–(8) 16 అర్జీలు ఉన్నట్లు వివరించారు. ఆయనతో పాటు ఎన్నికల సూపర్‌వైజర్ చక్రవర్తి ఉన్నారు.

ఓటర్ల జాబితాలో సవరణలకు 71 దరఖాస్తులు

నాదెండ్ల: మండలంలోని 57 పోలింగ్ బూత్‌ల్లో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో తొలిరోజు శనివారం 71 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో ఫారం–6 26, ఫారం–7 37, ఫారం–8 ఎనిమిది వచ్చాయి. గణపవరం, నాదెండ్ల గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి. వసంతబాబు, తహసీల్దార్ ఎన్. నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ ఆదివారమైనప్పటికీ రెండో రోజు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు మార్పు, చేర్పులు, నూతన ఓటు నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. నిర్ణీత గడువు లోగా వచ్చిన అర్జీల్ని పరిష్కరించాలని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు.

ఓటర్ల నమోదుకు ప్రజాప్రతినిధులు సహకరించాలి

శావల్యాపురం: ఓటర్ల నమోదుకు అన్ని పార్టీల నేతలు సహకరించాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు కోరారు. ఓటర్ల నమోదు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వేల్పూరు, కారుమంచి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్ని సందర్శించారు. బీఎల్‌వోలకు విధివిధానాల్ని వివరించారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని చెప్పారు. సమగ్ర ఆధారాలు అందజేసిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై ప్రజలు అపోహలు నమ్మరాదని ఆయన సూచించారు. డబుల్ ఎంట్రీలు ఉన్న వారంతా ఒకే ప్రదేశంలో ఓటు ఉండేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఆయన వెంట డెప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్ మండలంలోని విఠంరాజుపల్లి, పెదకంచర్ల, ఏనుగుపాలెం, నాగులవరం, పిట్టంబండ, ఉమ్మడివరం, గోకనకొండ గ్రామాల్లోని ఓటర్ల నమోదు శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తుల్ని స్వీకరించాలని ఆదేశించారు. ఓటు హక్కు పొందడానికి ఫారం –6, తొలగింపులకు ఫారం –7, మార్పులు, చేర్పులకు ఫారం –8పై ప్రజలకు అవగాహన కల్పించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. ఓటరు మార్పులు, చేర్పులు, తొలగింపు అంశాలపై సిబ్బందికి వివరించారు. ప్రలోభాలకు తావు లేకుండా ఫారం –7 దరఖాస్తుల్ని స్వీకరించాలని తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చేతికి ఠంచన్‌గా పింఛన్



నరసరావుపేట ఆసుపత్రిలో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్



గణపవరంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్

ఠంచన్‌గా పింఛన్ చేతిలో పడటంతో వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామునే వలంటీర్లు తలుపు తట్టి నగదు అందజేయడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వలంటీర్లు కూడా ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చడానికి దీక్షతో పని చేస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి దగ్గరికి వెళ్లి కూడా నగదు చేతిలో పెట్టడంతో పలువురు రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నరసరావుపేట రూరల్/నాదెండ్ల

వినుకొండకు చేరిన శ్రీవారి రథయాత్ర



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): విజన్ ట్రస్ట్, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ వెంకటేశ్వరస్వామి రథయాత్ర శనివారం వినుకొండ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా వాసవీ క్లబ్స్ జిల్లా గవర్నర్ ఖజ్జాయం విజయలక్ష్మి ఇంటి వద్ద నుంచి మేళతాళాలతో శ్రీనివాసనగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్స్ సభ్యులు మాట్లాడుతూ సెప్టెంబరు 23న తిరుమలలో ప్రారంభించిన ఈ రథయాత్ర ఆంధ్రప్రదేశ్‌లోని 250 దేవాలయాల్ని సందర్శించి, హిందూ ధర్మాన్ని ప్రచారం చేసి తిరిగి వైకుంఠ ఏకాదశికి తిరుమలకు చేరుకుంటుందని తెలిపారు.

రంగవల్లికలతో వ్యవసాయ విద్యార్థినుల సందడి



విద్యార్థినులు రంగవల్లులతో వేసిన సమస్యల చెట్టు వద్ద ఎంపీడీవో పుట్టారెడ్డి, ఏఓ అరుణ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభం కార్యక్రమంలో భాగంగా చాగంటివారిపాలెం గ్రామంలో సేకరించిన సమాచారాన్ని రంగవల్లులతో రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కాలానుగుణ క్యాలెండర్లు, ట్రెండ్ అనాలసిస్ వంటి పద్ధతులను రంగవల్లికలతో ఆర్బీకే వద్ద రైతులకు అవగాహన కల్పించారు. సమస్యల చెట్టు పేరుతో అర్థవంతంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, విద్యార్థినులు ఆశ్రిత, భవాని, అనూష, మానస, నవ్యశ్రీ పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో....

మండలంలోని ఇరుకుపాలెంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన కళాశాల విద్యార్థినులు విలేజ్ మ్యాప్ రంగులతో ఆర్బీకే వద్ద తీర్చిదిద్దారు. గ్రామ భౌగోళిక పటం, పంట చేలు, ప్రభుత్వ పాఠశాల తదుపరి చిత్రాలను వేసి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వరప్రసాద్, రమేష్, విద్యార్థినులు కృపా, లిల్లీగ్రేస్, మహాలక్ష్మీ, నాగిని, మధుకావ్య పాల్గొన్నారు.

నిమోనియాపై అప్రమత్తంగా ఉండాలి



నియోనియా వ్యాధి గురించి అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిస్తరణ అధికారి శ్యాంసన్

పెరికపాడు(క్రోసూరు): పిల్లల్లో నిమోనియాపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ శనివారం సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ రవి ఆదేశాల మేరకు వైద్యాధికారులు బాల అంకమ్మ బాయ్, మహమ్మద్ సాద్, సిరి చందనల ఆధ్వర్యంలో మండలంలోని పెరికపాడు తండా అంగన్‌వాడీ సెంటర్లో నిమోనియాపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్యాంసన్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల్లో సంభవించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో నిమోనియా తీవ్రమైనదని, వ్యాధి లక్షణాలు ద్వారా సులభంగా గుర్తించవచ్చునని ఆయన పేర్కొన్నారు. పిల్లల్లో నిమోనియా తదితర శ్వాస సంబంధ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ సాన్స్ ప్రోగ్రాం ప్రవేశపెట్టిందని , వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు(2024) వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఐదేళ్ల లోపు పిల్లల్లో నిమోనియా లక్షణాలను గుర్తించటం జరుగుతుందన్నారు. లక్షణాల్లో ముఖ్యంగా జలుబు, దగ్గు అధికంగా ఉండి త్వరత్వరగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునేటప్పుడు పక్క ఎముకలు కదలడం, అధిక జ్వరం రావడం, శ్వాస తీసుకునే సమయంలో శబ్దం రావడం, ఏమి తినకపోవడం, ఏమి తాగకపోవడం, అధికంగా నిద్ర పోవడం మొదలైనవి వ్యాధి లక్షణాల్లో ముఖ్యమైనవని అన్నారు. నిమోనియా నుంచి సురక్షితంగా ఉండాలంటే బిడ్డ శరీరాన్ని బట్టలతో పూర్తిగా కప్పి ఉంచాలని, ఇంటిలో పొగ లేకుండా చూసుకోవాలని, కిటికీలు తెరిచి ఉంచటం, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమైనవని ఆయన అన్నారు. కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ షేక్ అమీర్ అహ్మద్, ఆరోగ్య కార్యకర్త పి.మల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.మాధవి బాయి, షేక్ జరీనా, కేసీహెచ్ వెంకయ్య, జి.పూర్ణమ్మ, ఇంద్ర, విజయలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం తనిఖీ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): నిత్యావసరాలు పంపిణీ చేసే ఎండీయూ వాహనాన్ని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ శనివారం తనిఖీ చేశారు. రైస్ కార్డుదారులను నిత్యావసర సరుకుల పంపిణీలో ఇబ్బందులు ఉంటే చెప్పాలని సూచించారు. వాహనదారులు ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారా ? అని అడిగి తెలుసుకున్నారు. సరుకులను కార్డుదారులందరికీ అందించాలని వాహన నిర్వాహకులను ఆదేశించారు.

సమయపాలన పాటించాలని చెప్పారు. పంపిణీపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

వివాహితను సెల్‌లో రికార్డు చేసిన వ్యక్తులపై కేసు నమోదు

చిలకలూరిపేట టౌన్: వివాహిత స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన వారిపై అర్బన్ పోలీసుకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మార్కెండేయనగర్‌కు చెందిన ఓ వ్యక్తి భార్య నవంబర్ 28న బాత్రూమ్‌లో స్నానం చేస్తోంది. ఈ సమయంలో పక్క పోర్షన్‌లో అద్దెకు ఉండే అంజీనాయక్, రంగా నాయక్ సెల్ ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, విషయాన్ని గమనించి పెద్దగా కేకలు వేయడంతో వారు పరారయ్యారు. దీనిపై ఆమె భర్త పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

క్రోసూరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనదలచిన దంపతులు కమిటీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సంఘం ప్రతినిధులు చుండూరు సత్యనారాయణ, దేవరశెట్టి నాగేశ్వరరావు తెలిపారు.

నేడు బ్రాహ్మణ ఐక్యవేదిక ...

సత్తెనపల్లి: బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ కార్తిక వనసమారాధన ఈ నెల 3న పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గోపూజ, అభిత కుసుమాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర సహిత త్రిగుండ చండీ హోమం 20 మంది రుత్వికులు పాల్గొని నిర్వహిస్తారన్నారు. అనంతరం మాతృశ్రీ శివానంద నృత్య కళాశాల నరసరావుపేట వారి భరతనాట్యం నృత్య ప్రదర్శన, మహిళలకు, చిన్నారులకు లక్కీడిప్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బ్రాహ్మణ కుటుంబాలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి కొడవటిగంటి నాగపార్వతయ్య శర్మ, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్ ఉన్నారు.

క్రీడల్లో యువతీ, యువకులను ప్రోత్సహించాలి



రాజుపాలెం: అభివృద్ధి పథకాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పాల్గొనాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 17 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఆటలలో పాల్గొనే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, తహసీల్దారు నళిని, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంఈవో మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.

ఓట్లు తొలగింపుపై టీడీపీ నేతల రగడ సిగ్గుచేటు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శావల్యాపురం: ఓట్ల తొలగింపులపై టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా రగడ చేయటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అధికారులు విధుల్ని పారదర్శకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారాలు అన్నీ అవాస్తవమని, సమగ్ర ఆధారాల తమ వద్ద ఉన్నాయని, బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. నిబంధనలు మేరకు డబుల్ ఓట్లు ఉన్నవి మాత్రమే సమగ్ర ఆధారాలతో పార్టీలతో ప్రమేయం లేకుండా దరఖాస్తు చేశామని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి, అర్హత కలిగి ఉన్న వారికి ఓటుహక్కు కల్పించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేత ముండ్లమూరి అనిల్‌కుమార్, మండల కో–ఆప్షన్ సభ్యుడు దూదేకుల హుస్సేన్, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ ఏసురాజు, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, నాయకులు ముట్లూరి సత్యం, అల్లూరి వెంకయ్య పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలు ప్రశంసనీయం

- కలెక్టర్ శివశంకర్
- రొంపిచర్ల బ్యాంక్ శాఖ ప్రారంభం



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్, అధికారులు

రొంపిచర్ల: రైతులకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రశంసించారు. జిల్లాలో సుమారు 47వేల మందికి పైగా రైతులకు రుణాలిచ్చినట్లు తెలిపారు. రొంపిచర్లలో శనివారం బ్యాంక్ శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ జిల్లాలోని రైతులకు ఇప్పటి వరకు రూ.750కోట్లు, కౌలు రైతులకు రూ.12కోట్ల దాకా రుణాలు ఇచ్చిందని తెలిపారు. అనంతరం కౌలు రైతులకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు డిసెంబర్ 13 వరకూ రిజిస్ట్రేషన్లు



నాదెండ్లలో క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్



గుంటుపాలెంలో సచివాలయ ఉద్యోగులకు సామగ్రి అందజేస్తున్న అధికారులు, నేతలు

నాదెండ్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, డిసెంబర్ 13వరకూ కొనసాగనున్నట్లు ఎంఈవో–2 ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకూ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆయా సచివాలయాలకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన సామగ్రి చేరినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు ఆసక్తి గల క్రీడల వివరాలతో దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. సచివాలయాల పరిధిలో ఈ నెల 15 నుంచి 12 రోజుల పాటూ, ఆ తర్వాత ఐదు రోజులు నియోజకవర్గ స్థాయిలో , మరో వారం రోజుల్లో జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ

శావల్యాపురం: 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న సామగ్రిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ సచివాలయాలు వారీగా మంజూరు చేసిన క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వలంటీర్ల మొబైల్ యాప్‌లో నమోదైన వారంతా పాల్గొనవచ్చని చెప్పారు. ఈ పోటీలు ఈనెల 15 నుంచి 20 వరకు గ్రామ సచివాలయాల స్థాయి, మండల స్థాయిలో ఈనెల 21 నుంచి జనవరి 4 వరకు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముండ్లమూరి అనిల్‌కుమార్, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఏపీయం జి.వాసుబాబు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



చాగంటివారిపాలెంలో గోదాము నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతాంగ సేవలన్నీ ఇంటి వద్దకే అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెంలోని గుంటూరు జిల్లా సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సహకారంతో రూ.86 లక్షలతో నిర్మించనున్న వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న బహుళప్రయోజన గోదాము(మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్) నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను గ్రామంలోనే అందించేలా రైతు భరోసా కేంద్రాలను నిర్మించినట్లు పేర్కొన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందనప్పుడు నిల్వ చేసుకునేందుకు గాను అవసరమైన గోదాముల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల బాగోగులు గురించే పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ముప్పాళ్ల సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, మార్కెటింగ్ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి సహకార బ్యాంక్ మేనేజర్ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఇందూరి నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సక్కా శ్రీనివాసరావు, బ్రహ్మరెడ్డి, పీలా లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యుడు అజ్గర్‌వలి, సొసైటీ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, సాయిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మతల్లి పునఃప్రతిష్టా మహోత్సవం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): గ్రామంలో అంకాలమ్మతల్లి దేవాలయ శిలావిగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, హోమాల మధ్య ఆలయంలో అమ్మవారి ప్రతిష్టా మహోత్సవం జరిగింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఇటీవలే గ్రామంలోని ఎస్టీ కాలనీలో టీటీడీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఎంపీపీ మారూరి పద్మ, తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, మధిర వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి సాయిరెడ్డి, శిరిగిరి గోపాలరావు, బ్రహ్మరెడ్డి, పీలా లక్ష్మణ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.